

నూకాంబికకు గాజుల పూజ

రామగుండం: అంతర్గాంలోని నూకాంబిక పోచమ్మతల్లి నవరాత్రి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. గాజులతో విశేష పూజలు చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ జమ్ముల రామారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఎంసెట్ సైట్ నాట్ ఓపెన్

సుల్తానాబాద్: ఎంసెట్‌కు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు సైట్ ఓపెన్‌కాక ఇబ్బంది పడుతున్నారు. నాలుగు రోజులుగా సైట్ మొరాయిస్తోంది. అధికారులు చర్యలు తీసుకుని సైట్ ఓపెన్ అయ్యేలా చొరవ చూపాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

గరిష్టం/కనిష్టం

32.0/20.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

అసంఘటితరంగ కార్మికులకు చట్టం చేయాలి



మాట్లాడుతున్న చిలుక శంకర్

జ్యోతినగర్: అసంఘటితరంగ కార్మికుల కోసం ప్రభుత్వం సమగ్ర చట్టం తేవాలని కాంట్రాక్టు కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక శంకర్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో మాట్లాడారు. లేబర్‌కోడ్‌లను కుదించి కేంద్రం, ఒక్క జీవో కూడా విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులో సైతం ఒప్పందం అమలు కావడంలో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ పిలుపు మేరకు ఈనెల 18, 19న రామగుండంలో జిల్లా ఎనిమిదో మహాసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో బ్రాంచ్ కార్యదర్శి బుచ్చన్న, మల్లేశ్, రాయమల్లు, రాజన్న, నర్సయ్య, రవి, రమేశ్ పాల్గొన్నారు.

బీ-థర్మల్‌ను కాపాడుకుందాం రండి..!



దీక్షల కరపత్రం ఆవిష్కరించిన కౌశిక హరి

రామగుండం: నగరంలోని 62.5 మెగావాట్ల సామర్థ్యం గల బీ థర్మల్‌ను రక్షించుకునేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని బీజేపీ నాయకుడు కౌశిక హరి, కార్పొరేటర్ కౌశిక లత కోరారు. ఇందులో భాగంగా ఈనెల 20న నిరసన దీక్షకు దిగుతున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం అంబేద్కర్ చౌక్ వద్ద కరపత్రం ఆవిష్కరించారు. కాలం చెల్లిన విద్యుత్ కేంద్రం కావడంతో తరచూ సాంకేతికలోపాలు వస్తున్నాయని, మరోవైపు సరిపడా నిధుల కేటాయించకపోవడంతో ఉత్పత్తి నిలిచిపోతోందని తెలిపారు. ప్రత్యేక నిధులు కేటాయించి.. కొత్తగా రెండు థర్మల్ యూనిట్ కేంద్రాలను నెలకొల్పాలని డిమాండ్ చేశారు. అనంతరం కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. దీక్షకు తరలిరావాలని కోరారు. బీజేపీ నాయకులు నిమ్మరాజుల రవి, దారంగుల కుమార్, కుక్క గంగాప్రసాద్ తదితరులున్నారు.

18న జాబ్‌మేళా

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో ఈనెల 18న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి తిరుపతిరావు తెలిపారు. ప్రైవేట్ రంగంలోని 40లోన్ ఆఫీసర్ పోస్టులకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని, ఆసక్తి, అర్హతగలవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 18 నుంచి 28ఏళ్ల వయస్సుగల పురుషులు ఇంటర్, డిగ్రీ చదివి, ద్విచక్రవాహన డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, వివరాలకు 89853 36947, 95026 42441 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

విన్స్ అవార్డ్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కోల్‌సిటీ: విన్స్ (విమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత) అవార్డ్స్-2023 కోసం సంస్థలు, మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రామగుండం కార్పొరేషన్ మేయర్ బంగి అనిల్‌కుమార్, కమిషనర్ బి.సుమన్‌రావు తెలిపారు. 'స్వచ్ఛతలో మహిళల' నుంచి 'మహిళల నాయకత్వంలో స్వచ్ఛత' వరకు పరివర్తన జరిగిన నేపథ్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వచ్ఛోత్సవ్-2023 పేరుతో ఈనెల 30వరకు ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శానిటేషన్, వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో చాంపియన్‌లైన మహిళలను గుర్తించి విన్స్ అవార్డ్స్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలు, స్వశక్తి మహిళలు, ఎన్‌జీఓ, స్టార్టప్, సూక్ష్మ పరిశ్రమల నిర్వాహకులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఐదు నామినేషన్లను జాతీయ స్థాయి పురస్కారం నిమిత్తం ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు.

ఈ అంశాల్లో గుర్తింపు పొందిన వారే

కమ్యూనిటీ/పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంకులు శుభ్రపరిచే సేవలు, మురుగు నీటిశుద్ధి, మున్సిపల్ చెత్త సేకరణ, తరలింపు, మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ కేంద్రాలు, చెత్త నుంచి సంపద సృష్టించే ఉత్పత్తులు, ఘన వ్యర్థ పదార్థాల శుద్ధి సౌకర్యాలు, ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్, ఎడ్యుకేషన్, సామర్థ్య నిర్మాణం, టెక్నాలజీ-ఇన్నోవేషన్, ఇతరత్రా అంశాలలో గుర్తింపు పొందిన వారిని అవార్డులకు ఎంపిక చేయనున్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 20లోపు దరఖాస్తులు సమర్పించాలని వివరాలకు మెప్మా విభాగంలో సంప్రదించవచ్చని తెలిపారు.



'ఉపాధి' భేష్..!

- అడిగిన వారందరికీ పని
- 91 శాతం పనిదినాలు
- రాష్ట్రంలోనే జిల్లాకు 9వస్థానం
- 5,475 కుటుంబాలకు చేతినిండా ఉపాధి

సాక్షి, పెద్దపల్లి: వలసలు నియంత్రించాలని, నిరుపేదలకు పనికల్పించాలని కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన ఉపాధి హామీ పథకాన్ని జిల్లా ప్రజలు చక్కగా సద్వినియోగం చేసుకుంటున్నారు. పనుల్లో నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకుంటున్నారు. ఉన్నచోటే ఉపాధి లభించడంతో పనిచేసేందుకు కూలీలు ఉత్సాహంగా ముందుకొస్తున్నారు. ప్రతి జాబ్‌కార్డుదారుడికి ఏటా 100 రోజుల పని కల్పించేలా.. క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేయడంతో జిల్లా రాష్ట్రంలోనే 9వస్థానంలో నిలిచింది. పల్లెప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, ఎస్సారెస్పీ కాల్వలు, చెరువుల పూడికతీత, నర్సరీల్లో మొక్కల పెంపకం తదితర పనులు నిర్వహిస్తున్నారు. కుటుంబంలో జాబ్‌కార్డ్ పొందిన ప్రతిఒక్కరూ పనులకు హాజరవుతున్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 29 లక్షల పనిదినాలు లక్ష్యంగా నిర్ణయించుకోగా.. ఇప్పటి వరకు 27లక్షలు (91.01శాతం) పూర్తయ్యాయి. ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా 14 రోజులు ఉండటంతో ఆ లోపు లక్ష్యాన్ని చేరుకుంటామని అధికారులు చెబుతున్నారు.

మారిన విధానంలోనూ ముందంజ

కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకవచ్చిన నేషన్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్(ఎన్‌ఎంఎంఎస్) విధానంతో ఇబ్బందిగా మారింది. గతంలో పనుల కొలతలను వారం రోజుల తరువాత ఫొటోలు తీసుకునే వారు. ప్రస్తుతం అలాకాకుండా ప్రతిరోజు రెండు సార్లు ఫొటోలు తీసి ఆన్‌లైన్ చేయాల్సిన పరిస్థితి. అలా చేస్తేనే కూలీకి మస్టర్ పడుతుంది. ఒక్క పనికి సంబంధించి నాలుగు గంటల వ్యవధిలో రెండుసార్లు తీయడం ఇబ్బందిగా ఉన్నప్పటికీ జిల్లాలో నిర్దేశిత లక్ష్యం చేరువలో ముందంజలో ఉంది.

అనుసంధానంలో అంతంతే..

ప్రతి జాబ్ కార్డుదారుకు ఆధార్ అనుసంధానం చేస్తేనే పని డిమాండ్ తీసుకోవడం జరుగుతుంది. అదేవిధంగా ఆధార్ ఆధారిత చెల్లింపుల కోసం జాతీయ బ్యాంక్ ఖాతాదారులు అయితే ఎన్‌పీసీఐ చేయించుకోవాల్సి ఉంటుంది. లోకల్ బ్యాంక్ ఖాతాదారులు పోస్టాఫీస్ లేదా స్థానిక బ్యాంకులో ఖాతాకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలి. అలా అయితేనే నగదు చెల్లింపుల తిరస్కరణ సమస్య ఉత్పన్నం కాదు. అలాగే ఒకరి వేతనం మరొకరికి జమకాకుండా ఉంటుంది. అయితే జిల్లాలో 2,64,412 మంది కూలీలు ఉండగా.. వీరిలో 1,26,322 మంది కూలీలకు ఆధార్ అనుసంధానం పూర్తయ్యింది. మిగితావారివి చేయాల్సి ఉంది.

వేసవి భత్యం అందేనా..?

ఏటా ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఎండల నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం ప్రత్యేకంగా ఉపాధి కూలీలకు 20శాతం అదనపు భత్యం ఇచ్చేది. ప్రస్తుత ఏడాది నుంచి ఉపాధి చెల్లింపులు నేరుగా కేంద్రప్రభుత్వం ఎన్ఐసీ సర్వర్‌కు వెళ్లడంతో అందులో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకునే వీలులేకుండా పోయింది. వేసవిలో అదనంగా ఇచ్చే భత్యం సొమ్ము ఆటోమెటిక్‌గా అప్‌డేట్ చేసుకునేందుకు అవకాశం లేకపోవడంతో వేసవిలో పనిచేసే కూలీకు అదనపు భత్యం రాకుండాపోతోంది.

'ఉన్నతి'తో అవకాశాలు

స్వయం ఉపాధి కల్పన నిమిత్తం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఉన్నతి అనే కార్యక్రమాన్ని రూపొందించాయి. ఇందులో వందరోజులు పనిదినాలు పూర్తిచేసిన కుటుంబాలకే అవకాశం కల్పిస్తున్నారు. శిక్షణ అందించి నేరుగా ఉపాధి కల్పించాలనేది ఆశయం. ఈ మేరకు జిల్లాలో ఇప్పటి వరకు 380మందికి శిక్షణ కల్పించి ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పించారు.

ఉపాధి పథకం వివరాలు

జాబ్‌కార్డులు 1,23,687 కూలీలు 2,64,412
2022-23 పనిదినాల లక్ష్యం 29,91,185
కల్పించిన పనిదినాలు 27,22,392 (91.01శాతం)
100 రోజులు పని కల్పించిన కుటుంబాలు 5,475
71-100 రోజులు పని కల్పించిన కుటుంబాలు 10,954
50-70 రోజులు పని కల్పించిన కుటుంబాలు 7,238
50 రోజులలోపు పని కల్పించిన కుటుంబాలు 35,917
కూలీలకు చెల్లించిన డబ్బు రూ.4432.65లక్షలు
ఉపాధి కల్పనలో రాష్ట్రంలో 9వస్థానం
ఉన్నతి ద్వారా శిక్షణ పొందినవారు350

అందరికీ పని కల్పిస్తాం



అర్హులైన ప్రతి కూలీకి వంద రోజులు ఉపాధి కల్పించేలా పనులు గుర్తించాం. కూలీలకు వరంగా మారిన ఉపాధి హామీ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి జాబ్‌కార్డుదారుడు ఆధార్ అనుసంధానం చేసుకుంటేనే నగదు చెల్లింపుల్లో సమస్యలు ఉండవు. – శ్రీధర్, డీఆర్డీఓ



జిల్లాలో వర్షం..



సుల్తానాబాద్/కాల్వశ్రీరాంపూర్: జిల్లాకేంద్రంతోపాటు సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్, ఎలిగేడు, జూలపల్లి మండలాల్లో గురువారం వర్షం కురిసింది. రాత్రివేళ ఒకేసారి ఉరుములతో కూడిన ఈదురుగాలులు వీచాయి. అయితే ఎలాంటి ప్రాణనష్టంగానీ, ఆస్తినష్టంగానీ జరగలేదని అధికారులు తెలిపారు. ఈదురుగాలుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ వర్షం మామిడి రైతులకు నష్టం కలిగించే అవకాశముందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'డబుల్' పేరిట సర్కార్ మోసం



నిరసన వ్యక్తం చేస్తున్న విజయరమణారావు తదితరులు

- మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు
- ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన

పెద్దపల్లిరూరల్: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సీఎం కేసీఆర్ డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు అంశాన్ని తెరపైకి తెచ్చారని, ప్రజలను మరోసారి మోసం చేస్తున్నారని కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు తెలిపారు. పట్టణంలోని జెండాచౌరస్తా నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు గురువారం ప్రదర్శన చేపట్టారు. డబుల్‌బెడ్ రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. దరఖాస్తుదారులు, పార్టీనాయకులతో కలిసి ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. పెద్దపల్లి మున్సిపల్ పరిధిలో 2,079 మంది ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకుంటే కేవలం 484 మందికే కేటాయించారని విమర్శించారు. మిగతా దరఖాస్తుదారుల అందరికీ ఇవ్వాలని సూచించారు. ఇళ్లు ఇస్తామంటూ తొమ్మిదేళ్లుగా ప్రజలను కేసీఆర్ మోసం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో ఇందిరమ్మ పథకం పేరిట ఇళ్లు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. కౌన్సిలర్లు సుభాష్‌రావు, బూతగడ్డ సంపత్, మల్లయ్య, నాయకులు మస్రత్, బొడ్డుపల్లి శ్రీను, విజయ్‌సింగ్‌భాషా, శ్రీమాన్, ఈర్ల స్వరూప, శోభ, తిరుపతి తదితరులున్నారు.

ఆయిల్ పాం సాగుతో అధిక లాభాలు



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

పెద్దపల్లిరూరల్: ఆయిల్ పాం సాగు ద్వారా రైతులు అధిక లాభాలు సాధించవచ్చని కృషివిజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త భాస్కర్‌రావు అన్నారు. పెద్దపల్లి మండలం హన్మంతునిపేటలో గురువారం ఆయిల్ పాం సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్ పాం తోటలో మొదటి నాలుగేళ్లు అంతర పంటలను సాగు చేసుకునే అవకాశముందన్నారు. ఉద్యానవన అధికారి జ్యోతి, మండల వ్యవసాయాధికారి అలివేణి పంట సాగు విధానంపై వివరించారు. గ్రామానికి చెందిన రిటైర్డ్ ఏడీఏ గనెబోయిన శ్రీహరి భూమిలో మొక్కలు నాటారు. ఎంపీపీ స్రవంతి, జెడ్పీటీసీ బండారి రామ్మూర్తి, సర్పంచులు ఎద్దు కుమారస్వామి, తీగల సదయ్య, కన్నం జై, విండో డైరెక్టర్ మేకల కుమార్, ఏఈఓ చందన, కంపెనీ సీఈఓ కల్యాణ్, మహేశ్, అరవింద్, అజయ్ తదితరులున్నారు.



మూలకు పడిన 'ఆలన'

ఈ చిత్రంలో కనిపిస్తున్న ఆలన వాహనానికి మరమ్మతు రాగానే ఇదిగో ఇలా పెద్దపల్లి ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో పక్కన పడేశారు. బాగున్నప్పుడు ఎంతోమందికి సేవ చేసిన ఈ వాహనాన్ని ఇప్పుడు పట్టించుకునేవారు లేరు. రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన వాహనాన్ని ఇలా నిర్లక్ష్యంగా పడేయడాన్ని చూస్తున్న ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. సంబంధిత ఆరోగ్య శాఖ అధికారులు వాహనాన్ని వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

చివరి భూములకూ ఎస్సారెస్పీ నీరు



కాలువ ద్వారా వెళ్తున్న ఎస్సారెస్పీ నీరు



వరి పంట

- మూడు మండలాలకు తీరనున్న కరువు
- రాత్రివేళ కాలువల వెంబడి లస్కర్లతో తనిఖీలు

సుల్తానాబాద్/కాల్వశ్రీరాంపూర్: ఎస్సారెస్పీ నీటిపై ఆధారపడి పంటలు సాగు చేసిన చివరి ఆయకట్టు రైతులకు నీటి ఇబ్బందులు తొలగాయి. చివరి ఆయకట్టు వరకూ నీరందించేలా అధికారులు పక్కా ప్రణాళిక రూపొందించి అమలు చేస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎస్సారెస్పీ నీటితో జిల్లాలోని సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలాల్లో 80,853 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తుంటారు. ఆ నీటితో ఏటా రెండు పంటలూ పండిస్తారు. అయితే డీ-86 కాలువ ద్వారా నీరు విడుదలవుతున్నా.. చివరి భూములకు చేరడం లేదు. ఈ క్రమంలో ప్రతిపక్షాలు చివరి ఆయకట్టుకు నీరందించాలని, ఇప్పటికే పంటలన్నీ ఎండిపోతున్నాయని రాజీవ్ రహదారిపై రాస్తారోకో చేశారు. పలుసార్లు ధర్నాలు చేశారు.

46 గ్రామాలకు సాగునీరు..

రైతుల ఆందోళనల నేపథ్యంలో ఎస్సారెస్పీ అధికారులు స్పందించారు. సుల్తానాబాద్, కాలశ్రీరాంపూర్, ఓదెల మండలాల్లోని 46 గ్రామాలకు డీ-86 కెనాల్ ద్వారా చెరువులకు అనుసంధానం చేసి నీరు అందని ప్రాంతాల్లోని చెరువులు, కుంటలు నింపుతున్నారు. మరోవైపు చివరి ఆయకట్టుకు నీరు చేరాకే.. ఎగువ రైతులకు నీరిస్తామని చెబుతున్నారు. ప్రణాళిక ప్రకారం నీరందించాలని, నీరు అందక ఒక్క ఎకరం కూడా ఎండిపోవద్దని ఎస్సారెస్పీ పెద్దపల్లి ఈఈ ప్రసాద్ ఆదేశాలు కూడా జారీ చేశారు. రాత్రివేళ కాలువల తూములను ధ్వంసం చేసి నీటిని మళ్లిస్తారనే ఉద్దేశంతో కాలువల వెంబడి లస్కర్లతో ముమ్మర తనిఖీలు, గస్తీ చేపడుతున్నారు.

పంటలకు నీరు చేరుతోంది



ఎస్సారెస్పీ నుంచి కాలువల ద్వారా వస్తున్న నీరు పంటలకు చేరుతోంది. అధికారులు రాత్రి పూట కాలువల వెంబడి లస్కర్లతో గస్తీ ముమ్మరం చేస్తున్నారు. నీటిని అక్రమంగా వాడుకోకుండా చూస్తున్నారు.

– చొప్పరి రమేశ్, రైతు, చిన్నరాతుపల్లి, కాల్వశ్రీరాంపూర్

సమయం పొడిగించాలి



వేసవిలో సాగు ఆలస్యంగా ప్రారంభమైంది. ముందు వేసిన పంటలకు తెగుళ్లు సోకడంతో రెండోసారి పంటలు వేసుకోవాల్సి వచ్చింది. వాటిని కాపాడుకోవాలంటే ఏప్రిల్ రెండో వారం వరకు నీరు అందించాలి.

– మహిపాల్ రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్, సుద్దాల



ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు



తనిఖీలు చేసి విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తున్న సిబ్బంది



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సెకండియర్‌లో 170 మంది గైర్హాజరు

పెద్దపల్లిరూరల్: జిల్లావ్యాప్తంగా 25 పరీక్షకేంద్రాల్లో నిర్వహించిన ఇంటర్ సెకండియర్ పరీక్షలకు 170మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఇంటర్ నోడల్ అధికారి కల్పన తెలిపారు. గురువారం 5,781 మంది పరీక్ష రాయాల్సి ఉండగా.. 5,611 మంది మాత్రమే హాజరయ్యారని పేర్కొన్నారు. పరీక్షకేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకుని పరీక్షలు ప్రశాంతంగా రాశారు. పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు.

క్లుప్తంగా

ఆధునిక సాంకేతికతపై అవగాహన ఉండాలి


నైబర్‌హుడ్ యూత్ పార్లమెంట్‌లో వక్తలు

పెద్దపల్లిరూరల్: ప్రపంచంలో వస్తున్న ఆధునిక సాంకేతిక మార్పులకనుగుణంగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీని వినియోగించడంలో విద్యార్థులు ముందుండాలని డాక్టర్ వెంకటేశ్వర్లు, అంబిక అన్నారు. పెద్దపల్లి మదర్‌థెరిస్సా ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం నెహ్రూ యువ కేంద్రీయ ప్రోగ్రాం కోఆర్డినేటర్ రవీందర్ అధ్యక్షతన జరిగిన నైబర్‌హుడ్ యూత్‌పార్లమెంట్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పారిశ్రామికంగా వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వాటికనుగుణంగా అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రపంచంలోనే మన దేశానికి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. సింధు నాగరికత కాలంలోనే భూగర్భ డ్రైయినేజీలు, నలంద నాగార్జున యూనివర్సిటీలు ఉండేవని గుర్తు చేశారు. చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యంగా ఉండగలుగుతామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపేందర్, ఈదునూరి శంకర్, కొండ రవి తదితరులున్నారు.

టీచకుడు!

- మహిళా సిబ్బందిని వేధిస్తున్న ఇటిక్యాల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్
- నిత్యం ఉద్యోగినుల శరీరాలు తాకేందుకు తహతహ
- ఆగడాలు భరించలేక వీడియోలు తీసిన సిబ్బంది
- వీడియోలను కలెక్టర్ కార్యాలయానికి పంపిన 'సాక్షి'
- సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించిన కలెక్టర్ యాస్మిన్

సాక్షిప్రతినిధి, కరీంనగర్: అతనో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన అతను దారి తప్పాడు. తరగతి గదిలో పాఠాలు చెప్పాల్సింది పోయి.., తోటి మహిళా సిబ్బందిపై కన్నేస్తున్నాడు. తన కోరిక తీర్చాలంటూ పరోక్షంగా వేధిస్తున్నాడు. మాట వినకుంటే మహిళా సిబ్బందిని వేధిస్తూ తన ప్రతీకారం తీర్చుకుంటున్నాడు. మొత్తానికి 'కామాతురాణం న భయం..' అన్న మాటలను మరోసారి తన చేష్టలతో రుజువు చేస్తున్నాడు. పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ తోటి మహిళా సిబ్బందిని తన కామకోరికలు తీర్చాలంటూ వేధించే ఈ కీచక గురువుపై ఉన్నతాధికారులకు ఇటీవల వరుస ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అతని తప్పులను ఆధారాలతో సహా అటు హైదరాబాద్‌కు, ఇటు జగిత్యాల ఉన్నతాధికారులకు అందించారు. అతని ఆగడాలకు సంబంధించిన ఆధారాలను 'సాక్షి' కూడా కలెక్టర్‌కు పంపడంతో సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు.


మహిళా సిబ్బంది మీద చేయి వేస్తున్న శ్రీనివాస్

తాకేందుకు తహతహ

ఈ వ్యవహారంలో కీచక గురువు పేరు ఎం.శ్రీనివాస్. జగిత్యాల జిల్లాలోని రాయికల్ మండలం ఇటిక్యాలలోని మోడల్ కాలేజీకి ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఇతను మహిళా సిబ్బందితో విచిత్రంగా ప్రవర్తిస్తున్నాడు. మహిళలు ఒంటరిగా దొరికితే ఏదో వంకతో తాకేందుకు తహతహలాడుతున్నాడు. పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ ''ఇదేం పాడు బుద్ధి'' అని మిగిలిన సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. కొత్తలో అతనిది కేవలం మితిమీరిన క్రమశిక్షణ అనుకున్నామని.. కానీ, పోను పోను అతని అసలు ఉద్దేశం అర్థమైందని చెబుతున్నారు. తన దారికి రాని మహిళలను క్రమశిక్షణ పేరుతో వేధిస్తున్నాడని మిగిలిన టీచర్లు వాపోతున్నారు. నిమిషం ఆలస్యమైనా మెయిన్ గేట్లు వేసేస్తున్నాడని, అందరి ముందు పరువు తీసేలా కించపరుస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎదురు తిరిగితే తమను రకరకాల కారణాలు చెప్పి వేధిస్తున్నాడని, పనిచేసే చోట ఇలాంటి వాతావరణం తమకు తీవ్ర ఆందోళన కలగజేస్తోందని వాపోతున్నారు. ఒక దశలో అతని ఆగడాలు భరించలేక ఏకంగా అతని పైత్యపు చేష్టలను వీడియో తీశారు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు..!

శ్రీనివాస్ తిక్క చేష్టలపై అతని కింద పనిచేస్తున్న సిబ్బంది మొత్తం కలిసి ఇటీవల ఉన్నతాధికారులకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. అతను పాఠశాలలో ప్రవర్తిస్తున్న తీరును క్షుణ్ణంగా వివరిస్తూ.. ఫిబ్రవరి ఆఖరు వారంలో అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మోడల్ స్కూల్, కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌లకు రిజిష్టర్‌పోస్టు ద్వారా కలెక్టర్ జగిత్యాల, డీఈవోలకు నేరుగా ఫిర్యాదులను అందజేశారు. తమను స్వేచ్ఛగా పనిచేయకుండా చేస్తోన్న సదరు ప్రిన్సిపాల్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. తను కాలేజీలో మహిళలను వేధిస్తుండగా తీసిన వీడియోలు, ఫొటోలను ఫిర్యాదుకు జతచేశారు.

సస్పెండ్ చేస్తున్నాం: కలెక్టర్ యాస్మిన్ బాషా

ఈ నేపథ్యంలో సదరు గురువు మహిళలను కళాశాలలోనే అసభ్యకరంగా తాకుతున్న వీడియోలు 'సాక్షి'కి చేరాయి. ఈ వీడియోలను జగిత్యాల కలెక్టర్ యాస్మిన్ భాషాకు 'సాక్షి' చేరవేసింది. ఈ దృశ్యాలను చూసిన కలెక్టర్ స్పందించారు. వెంటనే సదరు మోడల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాస్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు.

ఫిర్యాదులో ఇంకేమున్నాయంటే..?

- ➡ స్టాఫ్ రూంలో మహిళలు ఒంటరిగా కనిపిస్తే వారిని తాకేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఫిర్యాదు కాపీకి అందజేశారు.
- ➡ పదో తరగతి విద్యార్థుల నుంచి నిర్ధారిత ఫీజుల కన్నా అదనంగా వసూలు చేస్తున్నాడు.
- ➡ విద్యార్థుల నుంచి పారిశుధ్య చార్జీలు అంటూ డబ్బులు వసూలు చేస్తున్నాడు. అలా వసూలు చేసిన మొత్తాన్ని కాలేజీ ఖాతాలో జమచేయడం లేదు.
- ➡ చిన్న కారణాలకే విద్యార్థులను ఇష్టానుసారంగా గొడ్లను బాదినట్లు బాదుతున్నాడు. ఇటీవల ఓ విద్యార్థిని చావబాదితే.. అతని తల్లిదండ్రులు పాత కలెక్టర్ రవికి ఫిర్యాదు చేశారని కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత


పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం ఆటో

మంథని: అక్రమంగా 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని మండలంలోని నాగారం శివారులో గల సబ్‌స్టేషన్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. గురువారం వేకువజామున పెట్రోలింగ్‌లో భాగంగా వాహనాలు తనిఖీ చేస్తుండగా ట్రాలీ ఆటో అనుమానాస్పదంగా కనిపించింది. తనిఖీ చేయగా 55 రేషన్ బియ్యం సంచులు కనిపించాయి. డ్రైవర్ బోగి సర్వేశ్‌ను విచారించగా మంథని మున్సిపాలిటీ పరిధి గంగాపురి, ఇతర గ్రామాల్లో ప్రజల నుంచి పది రూపాయలకు కిలో చొప్పున కొనుగోలు చేసి రాచర్ల రమేశ్ అనే వ్యాపారి సూచన మేరకు మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు చెప్పాడు. పట్టుబడిన బియ్యం, ఆటోను స్టేషన్‌కు తరలించామని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. తనిఖీల్లో ఏఎస్‌ఐ మల్లయ్య, పీసీ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెట్‌కు ఆర్థికసాయం


నెహ్రూ

గోదావరిఖని టౌన్(రామగుండం): ఖమ్మంకు చెందిన అథ్లెటిక్ క్రీడాకారుడు తాటికొండ నెహ్రూకు పాలకుర్తికి చెందిన వ్యాళ్ల హరీశ్‌రెడ్డి రూ.60వేలు ఆర్థికసాయం అందించినట్లు వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి రాము తెలిపారు. నెహ్రూ పూణేలో జరిగే నేషనల్ గేమ్స్‌కు సెలెక్ట్ అయ్యాడు. ఆర్థిక స్థోమతలేని అతడు ట్విట్టర్ ద్వారా రాష్ట్ర మంత్రి కేటీఆర్‌ను ఆర్థికసాయం కోరాడు. కేటీఆర్ అనుమతితో వెంటనే స్పందించిన పాలకుర్తి మండల ఎంపీపీ వ్యాళ్ల అనసూర్య, రామిరెడ్డి కుమారుడు ఎన్‌ఆర్‌ఐ, వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వ్యాళ్ల హరీశ్‌రెడ్డి రూ.60 వేలను బుధవారం నేరుగా నెహ్రూ బ్యాంకు ఖాతాకు పంపించాడు. ఈసందర్భంగా మంత్రి కేటీఆర్, హరీశ్‌రెడ్డికి నెహ్రూ కృతజ్ఞతలు తెలిపాడు.

'కేశోరాం'లో 'త్రిముఖ' పోటీ

- అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు
- బీఆర్ఎస్ నాయకుల మధ్య కుదరని సయోధ్య

పాలకుర్తి(రామగుండం): బసంత్‌నగర్‌లోని కేశోరాం సిమెంట్ కర్మాగారంలో ఈనెల 20న జరగనున్న పర్మినెంట్ కార్మిక సంఘం ఎన్నికల్లో త్రిముఖ పోటీ నెలకొంది. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పదవులకు నాలుగు ప్యానెళ్ల నుంచి అభ్యర్థులు బుధవారం నామినేషన్ వేసిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ నాయకుడు సూర సమ్మయ్య ప్యానెల్‌కు మద్దతుగా కాంగ్రెస్ అభ్యర్థి దుర్గం నరేందర్, మాటం రవీందర్ గురువారం తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో బరిలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు. బీఆర్ఎస్ నాయకుడు బయ్యపు మనోహర్‌రెడ్డి, దాడి మహేశ్ ప్యానెల్‌కు ఆటో, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇంజపూరి నవీన్‌కుమార్, రమేశ్ ప్రసాద్ మౌర్య ప్యానెల్‌కు ధర్మచక్రం, కాంగ్రెస్ నాయకుడు సూర సమ్మయ్య, వడ్ల సత్యనారాయణ ప్యానెల్‌కు చేతిలో చేయి గుర్తు కేటాయించినట్లు ఎన్నికల అధికారి డానియల్ తెలిపారు.

బీఆర్ఎస్ నుంచి బరిలో ఇద్దరు నాయకులు

బీఆర్ఎస్ తరఫున బయ్యపు మనోహర్‌రెడ్డి, ఇంజపూరి నవీన్‌కుమార్ బరిలో నిలిచారు. ఈ నేపథ్యంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, జెడ్పీ చైర్మన్ పుట్ట మధు సూచన మేరకు రామగుండం డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, పాలకుర్తి వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి కేశోరాం గెస్ట్‌హౌజ్‌లో ఇరువర్గాలతో చర్చలు జరిపారు. తొలిసారి పోటీచేస్తున్న తనకు అవకాశం ఇవ్వాలని నవీన్, కార్మికక్షేత్రంలో తనకే పట్టు ఉందని, మరోసారి అవకాశం ఇవ్వాలని మనోహర్‌రెడ్డి కోరారు. దీంతో నవీన్‌ను అధ్యక్ష అభ్యర్థిగా, మనోహర్‌రెడ్డి తరఫున ప్రధాన కార్యదర్శిగా పోటీ చేస్తున్న దాడి మహేశ్‌ను ప్రధాన కార్యదర్శి ప్యానల్‌గా బరిలో నిలిపేందుకు నిర్ణయానికొచ్చారు. ప్రస్తుతం నవీన్‌కుమార్ ప్యానెల్ నుంచి ప్రధాన కార్యదర్శిగా పోటీచేస్తున్న రమేష్ ప్రసాద్ మౌర్య అందుకు ఒప్పుకోకపోగా, స్వతంత్ర అభ్యర్థిగానైనా పోటీ చేస్తానని స్పష్టం చేసినట్లు తెలిసింది. దీంతో ఇరువర్గాల మధ్య సయోధ్య కుదరలేదు. అప్పటికే నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో ఇద్దరు బీఆర్ఎస్ నాయకులు బరిలో నిలవాల్సి వచ్చింది.

ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి

కేశోరాం కర్మాగారంలో పర్మినెంట్ కార్మిక సంఘం ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఏసీపీ ఎడ్ల మహేశ్ కార్మికులకు సూచించారు. అధికారులు, కార్మికులు, నాయకులు సమన్వయంతో ముందుకెళ్లాలని పేర్కొన్నారు. గెలుపు అనంతరం ఎలాంటి ర్యాలీలూ తీయొద్దని సూచించారు. పెద్దపల్లి, సుల్తానాబాద్ సీఐలు ప్రదీప్‌కుమార్, ఇంద్రసేనారెడ్డి, ట్రాఫిక్ సీఐ అనిల్‌కుమార్, కేశోరాం ప్లాంట్‌హెడ్ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఆర్ మేనేజర్ గోవిందరావు, ఐఆర్ అధికారి వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


వంటావార్పుతో నిరసన తెలుపుతున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: పంచాయతీ కార్మికుల అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని, బకాయి వేతనాలు చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ డిమాండ్ చేశారు. గురువారం పెద్దపల్లిలోని అమరవీరుల స్తూపం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి యాకయ్య, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు, కుమారస్వామి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా రోడ్డుపై వంటావార్పు చేపట్టి సహపంక్తి భోజనం చేశారు. పంచాయతీ కార్మికులను మల్టీపర్పస్ విధానం అంటూ పనిభారం పెంచారని ఆరోపించారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దుపర్చాలని, బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే, మంత్రులు, ఉన్నతాధికారులకు ఇష్టానుసారంగా వేతనాలు పెంచిన పాలకులు పారిశుధ్య సిబ్బందికి వేతనాలు పెంచేందుకు ధైర్యం చాలడం లేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు గణేశ్, అశోక్, రవీందర్, ఖాజా, అంజయ్య, రామాచారి, శ్రీనివాస్, రాజబాబు, గట్టయ్య, దేవేందర్, తిరుపతి, నాగయ్య, నరేశ్, సంపత్, రాజయ్య, స్వామి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మరణంలోనూ మరో ఇద్దరికి వెలుగులు


ఝాన్సీరాణి(ఫైల్)

కోల్‌సిటీ(రామగుండం): ఆమె మరణించినా మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు ప్రసాదించారు. అమ్మ మరణించిన దుఃఖంలో కూడా కుటుంబ సభ్యులు సమాజహితం కోసం నేత్రదానం చేసి ఆదర్శంగా నిలిచారు. గోదావరిఖని జీఎం కాలనీకి చెందిన ఐరెని ఝాన్సీరాణి(63) కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతూ గురువారం ఇంట్లోనే తుదిశ్వాస విడిచారు. దుఃఖంలో కూడా ఆమె నేత్రాలను దానం చేయడానికి భర్త జాన్ వెస్లీ, కొడుకులు, కోడళ్లు ఉదయ్‌కుమార్, లావణ్య, మధుకర్, శ్రీజ, కూతురు, అల్లుడు స్వప్న, శ్రీధర్‌రాజ్ ముందుకు వచ్చారు. సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆమె నేత్రాలు సేకరించి హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంక్‌కు తరలించారు. క్యాన్సర్‌తో మృతిచెందిన వారు కూడా నేత్రదానం చేయవచ్చని, బ్లడ్ క్యాన్సర్ ఉన్నవాళ్లు మాత్రం చేయడానికి వీల్లేదని వాసన్ ఐ బ్యాంక్ సీనియర్ మేనేజర్ ఆకుల అరవింద్ తెలిపారు. నేత్రదాత కుటుంబాన్ని సదాశయ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.శ్రవణ్‌కుమార్, లింగమూర్తి, ప్రతినిధులు వాసు, రాజమౌళి, భీష్మాచారి, లయన్స్ క్లబ్ బాధ్యులు రాజేందర్, మల్లికార్జున్, బెజిగోపాల్ త్రివేది అభినందించారు.

ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల చర్చలు వాయిదా


చర్చల్లో పాల్గొన్న యూనియన్ నాయకులు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల వేతన ఒప్పందంపై జరిగిన చర్చలు వాయిదా పడ్డాయి. హైదరాబాద్‌లోని రీజనల్ లేబర్ కమిషనర్ (ఆర్ఎల్‌సీ) సునీల్‌కుమార్ సాహూ సమక్షంలో గురువారం ఎన్టీపీసీ యాజమాన్య ప్రతినిధులు, కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు, కాంట్రాక్టర్లు, యూపీఎల్ అధికారులు చర్చల్లో పాల్గొన్నారు. కార్మికుల వేతన ఒప్పందంలోని 10 డిమాండ్లపై చర్చించగా.. వేతనాలు, ప్రస్తుతమున్న అదనపు భత్యం కంటే 3శాతం చెల్లిస్తామని యాజమాన్యం తెలిపింది. దీనికి కార్మిక సంఘాల ప్రతినిధులు ఒప్పుకోలేదు. యాజమాన్యం, కాంట్రాక్టర్, యూనియన్ నాయకుల మధ్య ద్వైపాక్షిక చర్చలు జరపాలని సూచించారు. డిమాండ్లపై సామరస్యపూర్వకమైన తీర్మానానికి వచ్చేలా అంతరాన్ని తగ్గించాలన్నారు. తిరిగి ఏప్రిల్ 26న మరోసారి చర్చలు కొనసాగించనున్నట్లు ఆర్ఎల్‌సీ ప్రకటించారు. చర్చల్లో యూనియన్ నాయకులు బాబర్ సలీంపాషా, నాంసాని శంకర్, ఇజ్జగిరి భూమయ్య, భూమల్ల చందర్, శ్రీనివాస్, జయసింహ, అధికారులు శామ్యూల్ ప్రశాంత్, దీపక్ పాఠక్, కాంట్రాక్టర్లు దాడి శ్రీనివాస్, మధుకర్, తిరుపతిరెడ్డి, యూపీఎల్ అధికారి శర్మ పాల్గొన్నారు.

చెన్నైలో రత్నాపూర్ వాసి మృతి


శ్రీనివాస్(ఫైల్)

రామగిరి(మంథని): మండలంలోని రత్నాపూర్ గ్రామానికి చెందిన కలికోట శ్రీనివాస్(35) చెన్నైలో అనుమానాస్పద స్థితిలో మృత్యువాత పడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నైలో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ ఆదివారం రాత్రి స్వగ్రామం రత్నాపూర్‌కు బయలుదేరాడు. ఈక్రమంలో చెన్నై రైల్వేస్టేషన్ సమీపంలో అతడి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. వారు ఇచ్చిన సమాచారంతో బంధువులు బుధవారం రాత్రి చెన్నైకి బయలుదేరారు. మృతుడికి భార్య సువర్ణ, కుమారులు అక్షిత్ (3), మోక్షిత్ (2), కూతురు (1)ఉన్నారు. శ్రీనివాస్ మృతికి గల కారణాలు తెలియరావడం లేదు.

ఒకరిపై రౌడీషీట్

రుద్రంగి (వేములవాడ): మండల కేంద్రానికి చెందిన నేవూరి కిషన్‌పై రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు ఎస్సై ప్రభాకర్ పేర్కొన్నారు. కిషన్ 2020, 2021 సంవత్సరాల్లో పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. 2022లో నేవూరి నర్సయ్యను భూతగాదాల నేపథ్యంలో ట్రాక్టర్‌తో ఢీకొట్టడంతో మృతిచెందాడని, అందుకు రౌడీషీట్ ఓపెన్ చేశామని తెలిపారు.

ఇసుక డంపులు సీజ్

వేములవాడ అర్బన్: వేములవాడ మండలం.. కొడుముంజ గ్రామ శివారులో అనుమతులు లేకుండా నిల్వ ఉంచి మూడు ఇసుక డంపులను గురువారం పోలీసులు గుర్తించారు. తహసీల్దార్ రాజుకు అప్పగించినట్లు టౌన్ సీఐ వెంకటేశ్ తెలిపారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం


డిపాజిట్ బాండ్ అందిస్తున్న రాజిరెడ్డి, సభ్యులు

రామగిరి(మంథని): సెంటినరికాలనీ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కల్వచర్లకు చెందిన భూస సింధుకు గురువారం లయన్స్‌క్లబ్ సభ్యుడు, ఆర్జీ–3 సివిల్ ఇంజినీర్ బెల్లం శ్రీనివాస్, జ్యోతి దంపతులు చేసిన రూ.10వేల ఆర్థికసాయాన్ని అందించి మాట్లాడారు. గ్రామానికి చెందిన భూస సురేశ్, రజిత దంపతులు ఔట్ సోర్సింగ్ కార్మికులు పని చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. సింధు భవిష్యత్ అవసరాల నిమిత్తం రూ.10వేలు పోస్ట్ ఆఫీస్‌లో జీవన్ సుకన్య పాలసీ ద్వారా ఫిక్స్ డిపాజిట్ చేయించి అందుకు సంబంధించిన బాండ్‌ను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్, గంట వెంకటరమణారెడ్డి, పల్లె వెంకటేశ్వరరావు, టీపీ సురేశ్‌బాబు, కళాధర్‌రెడ్డి, రేణుకుమార్ స్వామి, బూస స్వామి పాల్గొన్నారు.

వేజ్‌బోర్డు ఒప్పందం అమలు చేయాలి


గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రాజిరెడ్డి

గోదావరిఖని(రామగుండం): బొగ్గు గని కార్మికులకు 11వ వేజ్ బోర్డు ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 కృషిభవన్‌లో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కాలపరిమితి ముగిసి 20 నెలలు దాటినా అలవెన్స్‌లపై చర్చించకుండా కేవలం మినిమం గ్యారంటీ బెనిఫిట్ 19 శాతానికి ఒప్పుకొని కావాలని కాలయాపన చేయడాన్ని ఖండించారు. వేజ్ బోర్డు అమలు చేస్తున్నప్పటినుంచే అలవెన్సులు చెల్లిస్తారు కాబట్టి ఆలస్యం చేయడం వల్ల కార్మికులకు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. కావున వెంటనే అలవెన్స్‌లపై చర్చలు జరిపి కార్మికులకు మార్చి 2023 నుంచి చెల్లించే వేతనముతో 11వ వేతన ఒప్పందాన్ని అమలు చేయాలన్నారు. కార్మికులకు చెల్లిస్తున్న అలవెన్స్‌లపై ఫ్రీజ్ అనే పదాన్ని తొలగించాలన్నారు. కార్మికులకు రావలసిన పెన్షన్, మెడికల్ కార్డులు, వేతన ఒప్పందం విషయంలో జాతీయ సంఘాలు తప్పుడు ఒప్పందాలు చేసుకొని అన్యాయం చేస్తున్నాయన్నారు. ఇప్పటికైనా పెన్షన్ పెంపుదలకు కృషి చేయాలని, సీపీఆర్‌ఎంఎస్ కార్డుల విషయంలో రికవరీని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం పనితీరుకు ఆకర్షితులై వివిధ యూనియన్లకు సంబంధించిన 60 మంది కార్మికులు చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. గేట్ మీటింగ్‌లో నాయకులు ఐలి శ్రీనివాస్, చర్చల ప్రతినిధి కొత్త సత్యనారాయణరెడ్డి, ఫిట్ కార్యదర్శి కొంగర రవీందర్, జీఎం సభ్యులు శంకర్‌నాయక్, ఆకుల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి


సర్టిఫికెట్లు అందుకున్న మహిళలతో జీఎం మనోహర్, తదితరులు

గోదావరిఖని(రామగుండం): స్వయం ఉపాధి శిక్షణ పొందిన మహిళలు వ్యాపారంలో రాణించి ఆర్థికంగా ఎదగాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ కోరారు. వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పొందిన మహిళలకు గురువారం సీఈఆర్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో సర్టిఫికెట్లను అందజేశారు. ఈసందర్భంగా జీఎం మాట్లాడుతూ, సింగరేణి సేవా సమితి ద్వారా గతేడాది అనేక రకాల వృత్తి విద్యా కోర్సులను నేర్పించి ఖాదీ గ్రమోద్యోగ్ మహా విద్యాలయ్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించామన్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశామని, స్వయం ఉపాధి పొందడానికి ఈ సర్టిఫికెట్లు ఎంతగానో ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతతో పాటు ఉద్యోగులు, వారి కుటుంబాలు, ప్రభావిత గ్రామాల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు సవిత, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, సీనియర్ సెక్యూరిటీ అధికారి పీవీ రమణ, సీనియర్ పర్సనల్ అధికారి మండల శ్రీనివాస్, టీబీజీకేఎస్ ప్రతినిధి చిప్ప సత్యనారాయణ, ఫ్యాకల్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలపై ఉన్న శ్రద్ధ కార్మికులపై లేదు


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

గోదావరిఖని(రామగుండం): సింగరేణి ఎన్నికలపై ఉన్న శ్రద్ధ కార్మికుల సమస్యలపై లేదని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రిష్ణ అన్నారు. గురువారం జీడీకే–11ఏ గనిపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. బడా పెట్టుబడిదారులకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయన్నారు. ఈసందర్భంగా మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈనెల 18,19 తేదీల్లో జరిగే ఐఎఫ్‌టీయూ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నరేష్, ఎం.కొమురయ్య, పి.మొండయ్య, చింతల శేఖర్, మొగిలి, ఎస్‌సీ బాబు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన జీఎంకు సన్మానం

రామగిరి/గోదావరిఖని: సింగరేణిలో జీఎం(పర్సనల్)గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఎ.ఆనందరావును గురువారం ఆర్జీ–3 జీఎం తన్నీరు వెంకటేశ్వరరావు సన్మానించారు. ఈసందర్భంగా సెంటినరీకాలనీలోని జీఎం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జీఎం మాట్లాడుతూ, వివిధ హోదాల్లో సుమారు 35 ఏళ్లు సింగరేణి సంస్థలో విధులు నిర్వర్తించిన ఆనందరావు క్రమశిక్షణతో, స్నేహపూర్వకంగా అందరి మన్ననలు పొందడం గొప్ప విషయమన్నారు. సంస్థ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ పి.ఎలీషా, ఫైనాన్స్ ఏజీఎం శ్రీనివాసులు, డీజీఎం పర్సనల్ విలాస్ శ్రీనివాస్ పోద్దార్, డీవైపీఎం కావూరి మారుతి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆర్జీ–1 జీఎం కె.నారాయణ తన కార్యాలయంలో ఆనందరావును ఘనంగా సన్మానించారు.